సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
శుక్రవారం, జూన్ 21, 2024
డిజిటల్



# కవితకు మరో షాక్?

న్యూ ఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కి సంబంధించి సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే.. ఆమెను రౌస్ అవెన్యూ కోర్టు ముందు తీహార్ జైలు అధికారులు హాజరుపరచనున్నారు. అయితే.. కవితకు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగించే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. దీంతో.. శుక్రవారం ఈ కేసులో ఎలాంటి ట్విస్ట్ వెలుగు చూడనుందన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడి అధికారుల బృందం ఎమ్మెల్సీ కవితను మార్చి 15వ తేదీన అరెస్ట్ చేశారు. తొలుత ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు.. అదే రోజు సాయంత్రం 5:20 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి కొన్ని రోజుల పాటు ఆమె ఈడీ కస్టడీలో ఉన్నారు. ఆపై ఆమెను తీహార్ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉంచారు. అనంతరం ఈ కేసులో సీబీఐ ఎంట్రీ ఇచ్చి, విచారణ నిమిత్తం ఆమెను కస్టడీలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌లో సీబీఐ సంచలన విషయాలను ప్రస్తావించింది.

### ప్రధాన కుట్రదారు

లిక్కర్ కేసులో కవిత ప్రధాన కుట్రదారు సీబీఐ ఆ పిటిషన్‌లో పేర్కొంది. సౌత్ గ్రూప్‌కి గ్రూపునకు చెందిన ఓ మద్యం వ్యాపారి 2021లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కలిశారని.. తమకు అనుకూలంగా మద్యం పాలసీని రూపొందించాలని ఆయనను కోరారని తెలిపింది. అలా చేసినందుకు తమ పార్టీకి నిధులు ఇవ్వాలని ఆప్ కోరినట్లు సీబీఐ వివరించింది. ఇదంతా కవిత డైరెక్షన్‌లోనే నడిచినట్లు వెల్లడించింది. ఇలా మరెన్నో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు కవిత కస్టడీ ముగియనున్న తరుణంలో.. ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయన్నది ఉత్కంఠగా మారింది.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు

- ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీ లాండరింగ్ కేసు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్
- కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో వాదనలు
- తీర్పు రిజర్వ్ లో ఉంచిన కోర్టు
- తాజాగా తీర్పు వెలువరించిన జడ్జి న్యాయ్ బిందు

న్యూ ఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీలాండరింగ్ కేసును ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఢిల్లీ న్యాయస్థానం ఊరట కలిగించింది. కేజ్రీవాల్ కు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గురువారం కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ పై రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. కేజ్రీవాల్ పిటిషన్ రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ బెంచ్ ముందు విచారణకు వచ్చింది. వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా, వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి న్యాయ్ బిందు తీర్పును వెలువరించారు. రూ.1 లక్ష పూచీకత్తుతో కేజ్రీవాల్ కు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. అయితే, హైకోర్టులో అప్పీల్ కు వెళ్ళడానికి వీలుగా బెయిల్ బాండ్ పై సంతకం చేయడానికి 48 గంటల సమయం ఇవ్వాలని ఈడీ... కోర్టును కోరింది. అయితే, న్యాయమూర్తి న్యాయ్ బిందు ఈడీ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. ఢిల్లీ లిక్కర్ స్కాంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను ఈడీ అధికారులు మార్చి 21న అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో, ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మధ్యంతర బెయిల్ పై బయటికి వచ్చిన కేజ్రీవాల్ ఎన్నికలు ముగిసిన అనంతరం తిరిగి తీహార్ జైలుకు వెళ్లారు. ఇప్పుడు కోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో, శుక్రవారం ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు.



సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయగలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్:99854 44342

# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**ఏబీవీపీ కోరుట్ల నగర కార్యదర్శి మడవేణి సునీల్**




**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది గాని పరిపాలన విధానం మారలేదు అలాగే అధికారం మారింది గానీ అధికారుల తీరు మారలేదు మద్యంపై వచ్చే ఆదాయం మీద ఉన్న ధ్యాస విద్యార్థుల భవిష్యత్తుపై లేకపోవడం పాఠశాలను విచ్చలవిడిగా వారికి నచ్చినట్లు పుస్తకాలు అమ్ముకుంటూ సరియైన అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాల లు నడిపిస్తున్న పట్టించుకునే సంబంధిత నాయకులు అధికారులు లేకపోవడం శోచనీయమని ఏబీవీపీ నగర కార్యదర్శి మాడవేని సునీల్ విమర్శించారు. గురువారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు అయినా దేశ భవిష్యత్తు అయినా నిర్మాణం చేసేటటువంటి విద్యారంగం మీద ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందని విద్యాసంస్థలు మొదలై సుమారుగా 10 రోజులు కావస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అత్యాధిక ఫీజులు వసూలు చేస్తూ, అనుమతులు లేకున్నా విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విచ్చలవిడిగా పుస్తకాలు అమ్ముతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర విడటం లేదు ఈరోజు బ్రాండ్ల పేరుతోటి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అమ్ముతూ సిలబస్ కాకుండా వేరే పుస్తకాలను కొంటె మీకు విద్యను ఎవరు చెప్తారు అవి మా పాఠశాలలో చెల్లవు అంటూ బెదిరిస్తున్నారు యాజమాన్యాలు అలాగే విద్యాసంస్థలన్ని విద్యా కేంద్రాలుగా ఉండాల్సిన విషయం మరిచి ప్రభుత్వ పాలకుల ప్రోత్సాహంతో వ్యాపార కేంద్రంగా మారిపోయాయి. అలాగే నూతనంగా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకు పైగా కావస్తున్న ఈ యొక్క రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యారంగం గురించి మాట్లాడిన పాపాన పోలేదని ఈ యొక్క రాష్ట్రంలో మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ విద్యకు మంత్రి కరువైపోయారనీ మద్యంపై వచ్చే ఆదాయంపై ఉన్న ధ్యాస విద్యార్థుల బంగారు భవిష్యత్తు విద్య గురించి ఆలోచించే నాథుడే కరువయ్యాలని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులను కూడా విడదీసి మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్పు ఇచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వకపోవడం ప్రభుత్వం చేస్తున్న ఇట్టి దురాగతాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని, ఇలాంటి వింత పోకడలు సభ్య సమాజంలో తగవని ఇప్పటికైనా తక్షణమే విద్యార్థులు అందరినీ ఒకే కోణంలో చూసి అందరికీ ఫీజు రియంబర్స్మెంట్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసే విధంగా సరైన పద్ధతిలో నడిపే విధంగా స్పెషల్ కమిటీని వేసి ఉద్యమంలా నిర్వహించి ఇట్టి పరిస్థితులలో చక్కదిద్దాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు అందజేసి సమస్య పరిష్కరించే వరకు పోరాడుతామని ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ లని అరికట్టాలని డిమాండ్ చేశారు.



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

- నేడు జయశంకర్ వర్ధంతి సందర్భంగా సీఎం నివాళి
- తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడన్న సీఎం
- జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి జాగృతం చేశారన్న రేవంత్ రెడ్డి

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రొఫెసర్ జయశంకర్ నిలిచిపోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఈరోజు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు జయశంకర్ అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి జాగృతం చేశారని పేర్కొన్నారు. తుది శ్వాస వరకు జయశంకర్ తెలంగాణ ఏర్పాటు కోసం పరితపించారన్నారు.

# పిల్లలకు నులిపురుగుల మందులను తప్పక వేయించాలి



**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గురువారం కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆల్బెండజోల్ మెడిసిన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యతోపాటు ఆరోగ్యం కాపాడుకోవడానికి వైద్యశాఖ అధికారులు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, నర్సింగ్ గౌడ్,విటల్ ముదిరాజ్, నరసయ్య,కళిం పటేల్ పాల్గొన్నారు.



**కోరుట్లలో..**

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల పట్టణంలోని 23వ వార్డు ఏస్కొని గుట్ట అంగన్వాడీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు దశలుగా ఆరు నెలలకు ఒకసారి ఒక సంవత్సరం పిల్లల నుండి 19 సంవత్సరాల వరకు ఈ మాత్రలు వెయ్యడం జరుగుతుందని ప్రతి బిడ్డకు వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం, కలుషితమైన ఆహారం, జంక్ ఫుడ్ తినడం వంటి వివిధ కారణాలవల్ల పిల్లల్లో వర్మ ఇన్ఫెక్షన్ ఏర్పడుతుందని తెలియజేయడం జరిగింది. పిల్లల శరీరంలో రక్తహీనత బారిన పడకుండా తల్లి,దండ్రులకు అవగాహన కలిగించి, పిల్లలకు మాత్రలు వేయడం జరిగింది. ఈరోజు అందుబాటులో లేని పిల్లలకి మళ్లీ 27 తేదీ గురువారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆరోజు తప్పనిసరిగా పిల్లలకు వారి తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రంలో మాత్రలు వేయించాలని వైద్య సిబ్బంది తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి ప్రభాకర్, డాక్టర్ రాధా రాణి ఆర్‌బీఎస్‌కే, డాక్టర్ రమ్య ఎంఎల్‌హెచ్‌పీ, ఫార్మా సిస్టర్ భార్గవి, నిరోష , నాగరాణి, ఆశ నాగమణి, అంగన్వాడీ టీచర్ బి.రజిత, ఆయా పర్వీన్ వార్డులో పిల్లల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

**తంగళ్లపల్లిలో..**

**తెలంగాణ ప్రభ,(తంగళ్ళపల్లి) :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పడిగల మానస హాజరైనారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఇట్టి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ రజిత, తంగళ్ళపల్లి పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ, సిరిసిల్ల ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం,వైద్య సిబ్బంది జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు.

**కోరుట్ల 16వ వార్డులో..**

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** చిన్నారులను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని 16వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మ రాజారెడ్డి కోరారు . జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని గురువారం రోజున 16 వ వార్డులో వార్డు కౌన్సిలర్ చిన్నారులకు ఆల్బెండజల్ టాబ్లెట్లు వేశారు. ఈ సందర్భంగా 16 వార్డు కౌన్సిలర్ బలిజ పద్మరాజా రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల శరీరంలో బ్యాక్టీరియా దురద రాకుండా, అదే విధంగా కడుపు ఉబ్బసం రాకుండా, నట్టల నివారణ కొరకు ముందు జాగ్రత్తగా ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేయడం జరుగుతుంది.ప్రతి ఒక్కరు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ప్రభ, రత్నప్రభ, ఆశా వర్కర్ కంబ రాధిక, అంగన్వాడి ఆయా తిప్పిరి రాజనర్సు, చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు ఉన్నారు.







## మనిషి కోసం తపన

భయంకర పాశానుల మధ్య
మానవత్వ దీపం కొండెక్కిపోతుంటే...
జగతిని జాగృత పర్చే
మనసున్న మనిషన్న వాడి జాడేలేక
రోధిస్తున్నది పకృతి మాత ..!

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని
కనుగొన్నామనీ
భూగోళాన్ని అణుబాంబులా మారుస్తు
పకృతిని నాశనం చేస్తూ..
పక్షులు ప్రాణులు కోల్పోతుంటే...
జగతిని జాగృత పర్చే
మనసున్న మనిషన్న వాడి జాడేలేక
రోధిస్తున్నది పకృతి మాత ..!

అమాయక జీవులందరిపై
అడుగడుగున అవాంఛనీయ దుర్ఘటనలు
జరుగుతుంటే...
జగతిని జాగృత పర్చే
మనసున్న మనిషన్న వాడి జాడేలేక
రోధిస్తున్నది పకృతి మాత ..!

ధర్మపీఠంపై అధర్మనాట్యకేళి
సాగుతుంటే...
జగతిని జాగృత పర్చే
మనసున్న మనిషన్న వాడి జాడేలేక
రోధిస్తున్నది పకృతి మాత ..!

యువతి యువకుల్లారా ఇకనైనా
మేల్కొనండి
పకృతి మాత కన్నీళ్లను తుడిచి
నూతన శకానికి స్వాగతం పలకండి.

మంజుల పత్తిపాటి
కవి, రచయిత
+91 93470 42218





## వ్యక్తిగత శుభ్రత పాటించాలి

### ఏఎన్ఎం బొజ్జ రాణి

### అంగన్వాడీలో హ్యాండ్ వాష్ డే

తెలంగాణ ప్రభ, చెన్నారావుపేట : చెన్నారావుపేట మండలం అక్కల్ చెడ గ్రామానికి చెందిన అంగన్వాడీ కేంద్రంలో గురువారం చేతులు ఏ విధంగా కడుక్కోవాలి, పరిశుభ్రంగా లేకపోతే ఏ విధంగా ఆరోగ్యం దెబ్బతింటుందని ఏఎన్ఎం రాణి పిల్లలకు నేర్పించారు. చేతులు శుభ్రం లేకపోతే సూక్ష్మ క్రీములులోనికి పోయి ఆరోగ్యం క్షిణిస్తుందని వివరించారు. అందుకే పిల్లలు చేతులను శుభ్రంగా ఉంచేటట్లు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయమ్మ పెండ్యాల జ్యోతి, ఆశ వర్కర్ పడిదం రేణుక, ముత్యం సుప్రియ, పడిదం రవళి, పిల్లల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారులను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలి : ఏఎన్ఎం రాణి

తెలంగాణ ప్రభ (చెన్నారావుపేట) : చిన్నారులను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని చెన్నారావుపేట పీహెచ్ సీ ఏఎన్ఎం బొజ్జ రాణి సూచించారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామంలో గల అంగన్ వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలలో గురువారం చిన్నారులకు ఆల్బెండజల్ టాబ్లెట్లు వేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ చిన్నారుల శరీరంలో బ్యాక్టీరియా దురద రాకుండా, కడుపు ఉబ్బసం రాకుండా, నట్టల నివారణ కొరకు ముందు జాగ్రత్తగా ఆల్బెండజల్ టాబ్లెట్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ఉపాధ్యాయులు సురేందర్, ఆశా వర్కర్ పడిదం రేణుక, అంగన్వాడీ ఆయా పెండ్యాల జ్యోతి, స్కవెంజర్ పెండ్యాల పద్మ, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.





## వయోవృద్ధులపై వేధింపుల నివారణకు అవగాహన సదస్సు



**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల నివారణకు అవగాహన వారోత్స వాల్లో భాగంగా వృద్ధుల రక్షణ, పోషణ సంక్షేమ చట్టంపై సీనియర్ సిటిజెన్ల,పెన్షనర్ల, వివిద సంఘాల ప్రతినిధులకు రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ అవగాహన కల్పించారు. గురువారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ కార్యాలయం సమావేశ మందిరంలో డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం అధ్యక్ష తన జరిగిన ఈ అవగాహన సదస్సులో వయోధికులపై వేధింపుల నివారణకు జిల్లా సీనియర్ సిటీజేన్స్ అసోసియే షన్ ముద్రించిన తల్లిదండ్రులు,వయో వృద్ధుల పోషణ,సం క్షేమ చట్టం 2007 నియమావళి 2011 తో కూడిన అవగా హన కరపత్రాలు,స్టిక్కర్లను రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ ఆవిష్క రించారు. అనంతరం నిరాదరణకు గురవుతున్న వయోధికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కొందరు కొడుకులు,కోడళ్లకు హరి ఆశోక్ కుమార్, కోరుట్ల డివిజన్ కౌన్సెలింగ్ అధికారులు శివానందం,రాజ్ మోహన్,లక్ష్మీనారాయణ లు లు కౌన్సెలింగ్ తో పరిష్కరించారు. సీనియర్ సిటీజేన్స్ కు అండగా ఉంటూ ఆర్డీవోలకు ఫిర్యాదులు అందజేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న సీనియర్ సిటీజేన్స్ సంఘాల, డివిజన్, మండల, గ్రామ ప్రతినిధులైన 26 మందిని హరి ఆశోక్ కుమార్ చేతుల మీదుగా టాస్కా మెమోంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి.యాకూబ్, కోశాధికారి వెలుముల ప్రకాష్ రావు,కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి జీ.రాజ్ మోహన్, కోశాధికారి నల్ల లక్ష్మీ నారాయణ, ఉపాధ్య క్షుడు ఎం.డి. సైఫోద్దీన్,సాబితలి, ఏన్నం గంగాధర్, అబ్దుల్ గఫార్, దర్శనాల ఆనంద్, రాజయ్య, యువజన జెఎసి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దోనూరి భూమాచారి,కోరుట్ల డివిజన్,మండల,గ్రామాల సీనియర్ సిటిజేన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెండేళ్ల చిన్నవాడైన ప్రియుడుతో పెళ్లికి రెడీ అయిన సోనాక్షి సిన్హా..

బాలీవుడులో కొంతకాలంగా  పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నటి సోనాక్షి సిన్హా కూడా త్వరలో పెళ్లి కూతురు కాబోతోంది. సోనాక్షి జహీర్ ఇక్బాల్తో చాలా కాలంగా డేటింగ్ చేస్తోంది. వీరి పెళ్లి కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు వీరి పెళ్లికి సంబంధించిన వార్తలు బయటకు వస్తున్నాయి. మీడియా నివేదికల ప్రకారం, సోనాక్షి సిన్హా ఈ ఏడాది జూన్లో తన చిరకాల ప్రియుడు జహీర్ ఇక్బాల్తో వివాహం ఏడు అడుగులు వేయనుంది. సోనాక్షి సిన్హా – జహీర్ ఇక్బాల్ చాలా కాలంగా ఒకరికొకరు డేటింగ్ చేస్తున్నారు. మీడియా నివేదికల ప్రకారం, ఇద్దరూ ఇప్పుడు తమ సంబంధాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. వీరిద్దరూ త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. జూన్ 23న ముంబైలో జహీర్ను అత్యంత వైభవంగా పెళ్లాడనున్నట్టు సమాచారం. 37 ఏళ్ల సోనాక్షి సిన్హా 35 ఏళ్ల జహీర్ ఇక్బాల్ను పెళ్లి చేసుకోనుంది. వీరి పెళ్లి వార్తతో నటి అభిమానుల ఆనందానికి అవధులు లేవు. అయితే ప్రస్తుతం వీరిద్దరూ పెళ్లి వార్తలను ధృవీకరించలేదు. ఇద్దరి కుటుంబాలు పెళ్లికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. వీరిద్దరి వివాహ వేడుక శిల్పాశెట్టి రెస్టారెంట్ బాస్టియన్లో జరగనుంది. ఈ వివాహానికి సోనాక్షి కుటుంబ సభ్యులు, సన్నిహితులు హాజరుకానున్నారు. వీరి పెళ్లి కార్డు కూడా ప్రింట్ అయిందని చెబుతున్నారు. రిపోర్టుల ప్రకారం, వెడ్డింగ్ కార్డ్ మ్యాగజైన్ కవర్ లా ఉందని అంటున్నారు. ఇక ప్రస్తుతం వీరి పెళ్లికి ఏ తారలు హాజరుకావచ్చన్న సమాచారం అందలేదు.

